# ఖిన్న వదనాలు

★ యస్. మహబూబ్ ★

అన్నం తింటున్న కుర్రాడు గొల్లుమన్నాడు .

అన్నం ప్రత్తిగింజలుగా మారింది... కూర నీళ్లుగా మారింది—ఆకాశం నల్లగామారింది... భూమి తెల్లబడింది .ప్రత్తిగింజలుకూడా దొరకటంలేదు పశువులు ఏడుస్తున్నాయి. కండ్లనీరు క్రిందికి దిగి భూమిని తోతోసింది...భూమాత విలపించింది...పశువులు విస్తరం తేవాలని చూస్తున్నాయి, మనుషులు చావాలని చూస్తున్నారు . ఎండమాడ్చాలని చూస్తుంది . వర్షం స్థంభించింది...కాలువలు ఇంకాయి...కండలుపోయాయి...ఎముకలు మిగిలాయి ..పచ్చిగడ్డి పెరుగుతుంది...మనుషులకు, పశువులకు పోటీ వచ్చింది...ఏవి గెలుస్తాయో?. .మంత్రిగారు మనుష్యుల్ని చావనియ్యటం లేదు . చావులకు లైసెన్సులు అవసరమయ్యాయి లైసెన్సులకు లంచాలు విపరీతంగా పెరిగాయి...గొప్పవాళ్ళ మేడలు ఆకాశానికి అంటుతున్నాయి ..రూపాయ దమ్మిడీ అయింది పత్తిగింజ ఆహారం అయింది. మనుషులకి ఆరోగ్యం తక్కువైంది...ఆరోగ్యానికి కూరగాయలు శ్రేష్ఠం అంటున్నారు సైంటిస్టులంతా. మనుషులు పశువులైతే, దేశం స్వర్గంమాతుందని కలలుగంటున్నారు, నాయకులంతా.

స్వతంత్రం వచ్చింది...కాలం మారింది.. పిల్లలు పాలకోసం ఏడుస్తున్నారు... పాలకోసం చెట్లు తెప్పిస్తున్నారు నాయకులు... పూళ్ళల్లో యిళ్లు మాత్రం మిగులుతున్నాయి. పొలాల్లో పిచ్చి చెట్లుమాత్రం మిగులుతున్నాయి...మనుష్యులు ఆకూ, అలమూ పీక్కుతింటున్నారు.. కొందరు ఆకూ అలమూ తినే మానవుల్ని తింటున్నారు. లోకం యింతే భేదం అవసరం .సమానత్వం లేదు. న్యాయం చచ్చింది. ఆకులు కళకళ్లాడుతున్నాయని అనుకుంటున్నారు కొందరు ఆహారం ఎక్కువతినటం ప్రాణగండమని కనుక్కున్నారు. దేశం స్వర్గమాతుందని కలలు కష్టం తగ్గుతుందని వార్తలు వింటున్నాము... వార్తలు నిజం కాదని ప్రభుత్వప్రకటనశాఖ ప్రకటించింది...పేపర్ల వార్తలు నమ్మవద్దని మేం ప్రజల్ని హెచ్చరిస్తున్నాము మనుష్యులు ఆకలితో చావటంలేదు కలరా, మశూచికాలు ఎక్కువవుతున్నాయని ప్రకటనలు నిజం... యిదంతా నిజం అబద్ధం అడగు మన నాయకులు . దేశం సుభిక్షంగా వుంది

అశోకుడి సామ్రాజ్యం యిది...ఆయనకూ మనకూ భేదంలేదు. మనమే ఆయన, ఆయనే మనం. .నిజానికి అందరం ఒకటే ..భేదంలేదు. కరువు వస్తుందని ప్రజలనుకోవటం పొరపాటు... కావాల్సినంత ధాన్యంవుంది — గొప్ప గొప్ప మేడల అద్దాలో అది బయటకు రావాలట. బయటకు రాకపోతే మేడల్ని జైళ్ళలో పెట్టి లాక్ చెయ్యాలనిఆమోదించారు, ఏకగ్రీవంగా అంతా అంతా . మనమంచికోసమే ..బావుంది

ఎలుకలు మహాసభ చేసుకుంటున్నాయి. నదీప్రవాహముఖద్వారందగ్గర. నేనూ బయల్దేరేను. బయటే నిలబడ్డాను...తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పాదుపునుగురించి పెద్దలెక్చరు. చాలా ఎలుకలు బయటకు లేచివచ్చేశాయి- వినలేక... అధికాహారోత్పత్తి ప్రణాళికలు తయారుచేస్తాయట .. నాకాశ్చర్యం ! ఆశ్చర్యం మనకిసహజం .. ఎలుకలు మనుషులు సమానం. . పరమాత్మ స్వరూపం అంతా . ఎలుకలూ తక్కువవి కావు... మనుషులు మాత్రం తక్కువవుతున్నారు కాలం మారిపోయింది .. కాగితాలు నల్లబడుతున్నాయి... కడుపులు ఖాళీఅవుతున్నాయి... గుడిసెలు కూలుతున్నాయి .. డాబాలు మేడలు లేస్తున్నాయి... ఆకలి చచ్చిపోతుంది... అన్నం చచ్చిపోవటంలేదు... గొప్పవాళ్లు తక్కువగా తక్కువవాళ్లు గొప్పగా అవుతారని విన్నాము... ఆసామెత నిజంచచ్చి పోయింది...

నిజంనిజం కాదెప్పుడూ... అబద్ధం అబద్ధం కాదు... నాయకులు నాయకులు కారు...

కలంకలం కాదు. సిరాసిరా కాదు... వ్రాత వ్రాత కాదు...మనుషులు మనుషులు కారు... దేశం దేశం కాదు... అంతా ఏంకాదు.